## డిజిపి కార్యాలయంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** డిజిపి కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిగింది. రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్ళ నిండిన సందర్భంగా మంగళవారం నాడు దేశ వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు జరగడం తెలిసిందే. ఇందులో భాగంగా డిజిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శాంతి భద్రత ల అదనపు డిజి మహేష్ భగవత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ప్రాముఖ్యత గురించి అన్ని వర్గాల వారు తెలుసుకోవాలని అన్నారు. 1949 నవంబర్ 26వ తేదిన రాజ్యాంగానికి ఆమోదం లభించిందని తెలిపారు. ఆ రోజు దేశ చరిత్రలో ఒక ముఖ్యమైన రోజుగా ఆయన అభి వర్ణించారు. రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ అంబేద్కర్ కీలక భూమిక పోషించారని, ఈ ఇందులో బాబు రాజేంద్ర ప్రసాద్ సహా పలువురు ప్రముఖులు దేశాయతనం ఉందిచారని ఆయన తెలిపారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోని అనేక రాజ్యాంగాల నుంచి ప్రేరణ పొందిన అంశాలతో కూడిన సమగ్ర గ్రంథంగా ఆయన తెలిపారు. దేశంలోని ప్రజల కోసం, వారి ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు వంటి విలువైన అంశాలు వున్నాయని మహేష్ భగవత్ పేర్కొన్నారు. రాజ్యాంగం సమాజంలో అందరికి సమాన హక్కులు కల్పించిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ ఐజి రమేష్ నాయుడు, ఎఐజి రమణ కుమార్, లీగల్ సెల్ ఎస్పి సతీష్ త దితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరిచేత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని మహేష్ భగవత్ ప్రమాణం చేయించారు.

## సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జగన్నాథరావు కన్నుమూత

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 26:** సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జగన్నాథరావు కన్నుమూశారు. ఆయన మరణంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ జగన్నాథరావు పలు కీలక కేసుల పరిష్కారంలో తనదైన ముద్ర వేశారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. జస్టిస్ జగన్నాథరావు కుమారుడు, ఝార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు, వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుభూతి తెలియజేశారు. జస్టిస్ జగన్నాథరావు అంత్యక్రియలు బుధవారం హైదరాబాద్‌లో జరగనున్నాయి.

## ప్రముఖ సినీగేయ రచయిత కులశేఖర్ కన్నుమూత



**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** తెలుగు సినీ ఇండస్ట్రీలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సినీగేయ రచయిత కులశేఖర్ (54) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో మంగళవారం ఉదయం కన్నుమూశారు. చిత్రం, నువ్వునేను, మనసంతా నువ్వే, ఔనన్నా కాదన్నా, ఘర్షణ, భద్ర, సంతోషం, జయం, సైనికుడు లాంటి సూపర్‌హిట్ చిత్రాలకు పాటల రచయితగా కులశేఖర్ పనిచేశారు. అయితే వందకు పైగా సినిమా లకు స్టార్ రైటర్‌గా పనిచేసిన కుల శేఖర్ చెడు వ్యసనాలకు బానిసై కొన్నే ళ్లుగా చిత్ర పరిశ్రమకు దూరమయ్యాడు. కుటుంబ సభ్యులతోనూ కూడా దూరంగా ఉన్నాడు. కొన్ని సంవత్సరాల కిందటా ఒక దొంగతనం కేసులో కూడా అరెస్ట్ అయ్యి ఆరు నెలలు జైలులో ఉండి బయటికి వచ్చాడు. ఇక బయటికి వచ్చిన అనంతరం గేయ రచయితగా తన కెరీర్ నాశనం అవ్వడంతో మానసికంగా చాలా కుంగిపోయారు. దీంతో అతడికి అనారోగ్య సమస్యలు రాగా.. చివరికి దయనీయ స్థితిలో మృత్యు ఒడికి చేరారు. ఇక కులశేఖర్ మరణవార్త తెలుసుకున్న సినీప్రముఖులు ఆయనకు సంతాపం తెలియచేస్తున్నారు.




మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన వర్క్‌షాపులో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్

## గొలుసుకట్టు చెరువుల ధ్వంసం వల్లే రోడ్లపైకి వర్షపు నీరు

### 61 శాతం కనుమరుగు.. మిగిలిన వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనదే: హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** గొలుసు కట్టు చెరువుల వ్యవస్థ దెబ్బతినడం వల్లే హైదరాబాద్ నగరంలో 2 సెంటిమీటర్ల వర్షం కురిసినా రోడ్లు నీట మునుగుతున్నాయని హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం బేగంపేట్‌లోని హరితప్లాజాలో నేషనల్ ఇన్విరాల్ మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్ఈఈఆర్ఐ) ఆధ్వర్యంలో "బ్రెయిమ్ స్ట్రోమ్ సెషన్ అన్ ఆర్బన్ లేక్ మేనేజ్‌మెంట్ "పై వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి కమిషనర్ రంగనాథ్ హాజరై మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో 61 శాతం చెరువులు కనుమరుగయ్యాయని, ఇక 39 శాతం మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. ఇలాగే కొనసాగితే 2050 నాటికి దాదాపు 75 నుంచి 80 శాతం అర్బనైజ్ అయ్యే అవకాశం ఉందని, అందుకే హైదరాబాద్ లోని చెరువులను కాపాడాల్సి బాధ్యత ఎంతైనా ఉందన్నారు. నగరంలోని చెరువులు ఎన్ని? వాటి విస్తీర్ణం ఎంతా? ఎఫ్టీఎల్, బఫర్ జోన్ ఎంత? అనే వాటిని నిర్ధారించే పనిని హైడ్రా చేపట్టిందన్నారు. పట్టణీకరణ వేగంగా జరుగుతోన్న ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణాన్ని, ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని, మెరుగైన జీవనాన్ని అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందని ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలకు రక్షణ కల్పించడం, ప్రభుత్వ ఆస్తులను కాపాడటం, చెరువుల పరిరక్షణ, ప్రజల అవసరాల కోసం కేటాయించిన పార్కులను, రహదారులు కబ్జాలకు గురికాకుండా కాపాడటమే హైడ్రా ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

# రైతు పండుగను విజయవంతం చేయాలి

### రేపటి నుండి 30 వరకూ సదస్సులు

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ లో ఈనెల 28 నుండి మూడు రోజుల పాటు నిర్వహించే రైతు పండుగను విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణా రావు, దామోదర్ రాజా నర్సింహా విజ్ఞప్తి చేశారు. ఈ రైతు సదస్సు ఏర్పాట్లపై మంగళవారం సచివాలయంలో జరిగిన సమావేశంలో ఈ సందర్భంగా వ్యవసాయ మంత్రి నాగేశ్వర రావు మాట్లాడుతూ, ఏ రంగానికి లేని విధంగా వ్యవసాయ రంగానికి అధిక మొత్తం నిధులు కేటాయించిందన్నారు. ముఖ్యంగా రైతు రుణ మాఫీ తో రాష్ట్రంలోని ప్రతీ అసెంబ్లీ నియోజక వర్గంలో కనీసం 20 వేల మంది నుండి 30 వేల మంది రైతులకు లబ్ది చేకూరిందని వెల్లడించారు. రైతులకు పెద్ద ఎత్తున చేకూరిన ఈ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలు, వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులు, ఆదర్శ రైతుల ప్రసంగాలు, ఈ రైతు సదస్సులో ప్రధాన అంశాలుగా ఉంటాయని తెలిపారు. ఈనెల 28 న ఉదయం 10 గంటలకు ఈ రైతు సదస్సు ప్రారంభ మవుతుందని, ఈ మొదటి రోజు సదస్సుకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన రైతులు హాజరవుతారని, రెండోరోజైన 29 న మహబూబ్ నగర్ జిల్లాయేతర ప్రాంతాలనుండి రైతులు హాజరవుతారని, 30 న రాష్ట్రంలోని అన్ని జిల్లాలనుండి కనీసం లక్ష మంది రైతులు ఈ రైతు సదస్సుకు హాజరవుతారని వివరించారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

ఈ మూడు రోజులు రైతు సదస్సు వేదికపై ఆదర్శ రైతులచే ప్రసంగాలు, ఆధునిక వ్యవసాయ విధానాలపై వివరణలు, వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ మత్స్య తదితర రంగాలకు చెందిన ఆదర్శ రైతులచే ప్రసంగాలు, విజయగాథలపై వీడియో ప్రదర్శనలు ఉంటాయని వివరించారు.

అంతేకాకుండా ఆధునిక వ్యవసాయ యంత్ర సామాగ్రి, వివిధ రకాల పంట రీతులు, హైబ్రిడ్ వంగడాలు, ప్రభుత్వం అమలుచేస్తున్న పలు పథకాలపై ప్రదర్శన స్టాళ్ళను సంబంధిత శాఖలు ఏర్పాటు చేస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో ఇంకా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శి రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

# అదానీ విరాళాన్ని తిరస్కరించడం హర్షణీయం

### సిఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా

### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** దేశ ప్రధాని నరేంద్ర మోడీకి మంచి స్నేహితుడైన వ్యాపారవేత్త అదానీ ప్రకటించిన రూ. 100 కోట్ల విరాళాన్ని తిరస్కరించడం హర్షణీయమని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని మంగళవారం నారాయణ ఒక ప్రకటనలో అభినందించారు. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమక్షంలో ముఖ్యమంత్రి మీడియాకు ఈ విషయాన్ని వెల్లడించారని తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఫౌండేషన్ ఈ విరాళాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. అదానీ మోసపూరిత ఆధారాలతో పాటు మోడీ, అదానీల మధ్య స్నేహ బంధాన్ని సీపీఐ మీడియా దృష్టికి తీసుకెళ్లిందని గుర్తు చేయడం సందర్భానుసారం కాదన్నారు. అదానీకి అనేక విమానాశ్రయాలు, నౌకాదళ ఓడరేవులు ఎలా వచ్చాయో కూడా సీపీఐ బట్టబయలు చేసిందని నారాయణ గుర్తు చేశారు. ప్రధాని మోడీ అనేక ప్రధాన భూములను అతి తక్కువ ధరలకు ఎలా అప్పగించారో సామాన్య ప్రజలతోపాటు రాజకీయ నాయకులకు తెలుసునన్నారు. అన్నింటికంటే మించి ఆస్ట్రేలియాలోని క్వీన్ ల్యాండ్‌లోని అదానీ బొగ్గు కంపెనీ.. పర్యావరణవేత్తల నుంచి.. ఆదివాసీల నుండి ఏడేళ్లపాటు వ్యతిరేకతను ఎదుర్కొందన్నారు. చివరకు ఆస్ట్రేలియా ప్రభుత్వం అదానీ బొగ్గు గనులను మూసివేస్తున్నట్లు ప్రకటించిందని నారాయణ తెలిపారు. ప్రస్తుతం మోసం, లంచం కేసులో అదానీ ఇరుక్కున్నారని.. అతను న్యూయార్క్ కోర్టును ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. ఈ తరుణంలో భారత ప్రభుత్వం అతడిని అరెస్ట్ చేయాల్సిన పరిస్థితులను ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. కార్పొరేట్ సంస్థల నుండి విరాళం తీసుకోవడం అనైతికం మరియు సమర్థించ లేనిదని.. ఇది క్విడ్‌ప్రోకో అని నారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యాపారవేత్త అదానీ విరాళంపై తగిన నిర్ణయం తీసుకుందని మెచ్చుకున్నారు.

# సోలార్ విద్యుత్ పొదుపునకు పైలట్ ప్రాజెక్టుగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్

### సింగరేణి సిఎండి బలరామ్

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** సోలార్ విద్యుత్ సద్వినియోగం, పొదుపు చర్యల్లో భాగంగా సింగరేణి సంస్థ మరో వినూత్న ఆవిష్కరణకు సిద్ధమైంది. మందమర్రి సోలార్ ప్లాంట్‌లో పగటిపూట ఉత్పత్తి జరిగి, వినియోగం తర్వాత ఇంకా మిగిలిన సోలార్ విద్యుత్‌ను వృథాగా పోనీయకుండా బ్యాటరీలో నిల్వ చేసేందుకు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు వీటికి సంబంధించిన వివరాలను సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మందమర్రి ఏరియాలోని 28 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌లో పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపడుతున్న ఒక మెగా వాట్ నిల్వ సామర్థ్యం గల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ పద్ధతి వల్ల నెలకు రూ. 13 లక్షల విలువైన (ఏడాదికి రూ.1.6 కోట్ల) సోలార్ విద్యుత్ వృథా కాకుండా సద్వినియోగం అవుతుందిన తెలిపారు. ఈ పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే మరో రెండు మెగా వాట్ల సామర్థ్యం గల సిస్టమ్‌లను ఇక్కడ ఏర్పాటు చేయనున్నామని, తద్వారా నెలకు దాదాపు రూ.40 లక్షల (ఏడాదికి రూ.4.8 కోట్ల) విలువైన సోలార్ విద్యుత్ సద్వినియోగం అవుతుందని వెల్లడించారు. కాగా మందమర్రిలో సింగరేణి సంస్థ తన గనుల విద్యుత్ అవసరాల నిమిత్తం 28 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ను 2021లో ఏర్పాటు చేసుకుంది. ఈ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలలో ఉన్న మొత్తం 11 భూగర్భ గనులు, 4 ఓపెన్ కాస్ట్ గనులు, తదితర పారిశ్రామిక అవసరాలకు వినియోగిస్తున్నారు. ఈ ప్లాంట్ ద్వారా రోజుకు సగటున ఒక లక్ష 34 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండగా దీనిలో సుమారు ఒక లక్ష 14 వేల యూనిట్ల విద్యుత్‌ను కంపెనీ వినియోగిస్తుంది. కానీ ఇంకా మిగిలి ఉన్న సుమారు 20 వేల యూనిట్ల విద్యుత్ ను మాత్రం వినియోగించలేకపోతుంది. ఫలితంగా ఈ విద్యుత్ ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు ఉచితంగా అందజేయాల్సి వస్తుంది. ఈ విధంగా ఉచితంగా వెళుతున్న 20 వేల యూనిట్ల సోలార్ విద్యుత్ ను సద్వినియోగం చేయాలన్న ఉద్దేశంతో దీనిని నిల్వ ఉంచుకొని, తిరిగి అవసరమైనప్పుడు వినియోగించుకునే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌ను ఇక్కడ ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు.




## లైఫ్‌సైన్సెస్ రంగంలో మరింత ముందడుగు

### ప్రపంచవ్యాప్తంగా 33 శాతం వ్యాక్సిన్లు, జనరిక్ ఔషధాలు తెలంగాణ నుంచే సరఫరా : మంత్రి శ్రీధర్‌బాబు

### ఇండోబెల్జియన్ లైఫ్‌సైన్సెస్ సదస్సును ప్రారంభించిన మంత్రి

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం టీకాలు, జనరిక్ ఔషధాలు, క్యాన్సర్, ఇతర సంక్లిష్ట వ్యాధుల నివారణకు అవసమైన బయోసిమిలర్స్ ఉత్పత్తిలో ప్రపంచ గమ్యస్థానంగా వృద్ధి చెందిందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. లైఫ్ సైన్సెస్ రంగంలో మరింత ముందడుగు వేసేదిశగా ప్రస్థానం కొనసాగుతోందని తెలిపారు. మంగళవారం మాదాపూర్‌లో ఇండోబెల్జియన్ లైఫ్‌సైన్సెస్ సదస్సును ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 33 శాతం వ్యాక్సిన్లు, జనరిక్ ఔషధాలు తెలంగాణ నుంచే సరఫరా అవుతాయని శ్రీధర్ బాబు గుర్తు చేశారు.

కొత్త అవకాశాలు, అనుకూల వాతావరణంతో బెల్జియం లైఫ్ సైన్సెస్ కంపెనీలకు ఆహ్వానం పలుకుతున్నామని అన్నారు. ఇక్కడ నైపుణ్యం కలిగిన మానవవనరులు, మౌలిక వసుతులు అందు బాటులో ఉన్నాయన్నారు. యూరోపియన్ యూనియన్‌లో రెండో అతిపెద్ద ఔషధ ఎగుమతిదారుగా ఉన్న బెల్జియం, ఆరోగ్య రంగంలో విప్లవాత్మకమైన ఆవిష్కరణలతో ముందంజలో ఉందని మంత్రి వెల్లడించారు. ఈ సదస్సు ప్రపంచ ఆరోగ్య సంరక్షణ రంగంలో నూతన మైలురాళ్లను చేరుకునే ఒక సహకార వేదికగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. డా. అజిత్ షెట్టి, డా. పీటర్ పియోట్ లాంటి ప్రముఖుల ద్వారా బెల్జియంతో ఇప్పటికే అనుబంధాన్ని కొనసాగిస్తున్నట్టు తెలిపారు. బెల్జియంలోని ఫ్లాండర్స్ రాష్ట్రం, తెలంగాణ లైఫ్ సైన్సెస్‌ల మధ్య ద్వైపాక్షిక ఒప్పందం అమలులో ఉందని శ్రీధర్ బాబు తెలిపారు.

ఈ సదస్సు ఏర్పర్చిన భూమికతో ఫ్లామిష్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బయోటెక్నాలజీ, వాక్సినోపొలిస్, యూనివర్సిటీ ఆఫ్ గెంట్ వంటి సంస్థలతో భాగస్వామ్య అవకాశాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ప్రాణరక్షక ఆవిష్కరణలను అందరికి చౌకగా అందించడం వంటి లక్ష్యాలను పాటించే దిశలో రెండు దేశాలు ముందుకు సాగాలని శ్రీధర్ బాబు కోరారు. ఈ సదస్సుకు బెల్జియం రాయబారి డిడియర్ వాండర్హాసెల్ట్, ద్వైపాక్షిక వ్యవహారాల డైరెక్టర్ జనరల్ జీరోన్ కూర్మన్, డాక్టర్ రెడ్డీస్ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. ప్రసాద్, బయో ఏషియా అంతర్జాతీయ సలహామండలి ఛైర్మన్ డా. అజిత్ శెట్టి, లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాఫికల్ మెడిసిన్ ఆచార్యులు డాక్టర్ పీటర్ పియోట్, ఎం.ఎస్. స్వామినాథన్ రిసెర్చ్ ఫౌండేషన్ ఛైర్ పర్సన్ డా. సౌమ్య స్వామినాథన్, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయెన్స్ ప్రధాన కార్యదర్శి సుదర్శన్ జైన్, పలువురు శాస్త్రవేత్తులు, పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు.

## చెరువులో పడి తల్లి, ఇద్దరు పిల్లలు మృతి

**వనపర్తి క్రైమ్, నవంబరు 26, ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రంలోని తాళ్ల చెరువులో అనుమానాస్పద స్థితిలో తల్లి ఇద్దరు పిల్లలు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్సై హరి ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి పట్టణంలోని గణేష్ నగర్‌కు చెందిన నఫీజ్ బేగం తన పిల్లలు హబీబ్, సనా బేగం లు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# జగిత్యాలలో జెఇఇ మెయిన్ పరీక్షా కేంద్రం

### మొదటి విడత జెఇఇకి 12.70 లక్షల మంది దరఖాస్తు

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** దేశంలోని ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాల కోసం కేంద్రం నిర్వహిస్తున్న జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ)- మెయిన్-2025 మొదటి విడత దరఖాస్తు గడువు ముగిసింది. జేఈఈ మెయిన్ పరీక్షలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. మొదటి విడతలో భాగంగా అక్టోబర్ 28 నుంచి నవంబర్ 22 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించారు. దరఖాస్తు గడువు ముగిసే సమయానికి జేఈఈ మెయిన్‌కు 12.70 లక్షల దరఖాస్తులు వచ్చినట్టు తెలుస్తోంది. జేఈఈ మెయిన్ దరఖాస్తు గడువు ఈ నెల 22వ తేదీతో ముగియగా.. పేపర్-1, పేపర్-2లకు కలిపి దేశవ్యాప్తంగా సుమారు 12.70 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది కూడా తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 1.50 లక్షల మంది పోటీపడనున్నారు. జనవరిలో జరిగిన పేపర్-1 పరీక్షకు(బీటెక్ సీట్లకి) 12.21 లక్షలు మంది దరఖాస్తు చేసుకోగా.. పేపర్-2 అయిన బీఆర్క్, బీప్లానింగ్ సీట్ల కోసం 74 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే గత ఏడాది జేఈఈ మెయిన్ మొదటి విడతకి 12.95 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా..ఈ సారి కొంత తగ్గుదల కనిపిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు హైదరాబాద్‌తో పాటు కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్, నిజామాబాద్, సూర్యాపేట, సిద్దిపేట, కొత్తగూడెంలో పరీక్షా కేంద్రాలు కొనసాగాయి. ఇప్పుడు కొత్తగా జగిత్యాలలో పరీక్ష కేంద్రాన్ని ఎన్‌టీఏ ఏర్పాటు చేయనుంది.

# కాంగ్రెస్ కార్యకర్తలా పనిచేస్తోన్న ఇక్కడి కలెక్టర్!

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**సిరిసిల్ల బ్యూరో, నవంబరు 26, ప్రభాతవార్త :** ఇక్కడి కలెక్టర్ కాంగ్రెస్ కార్యకర్తగా పని చేస్తున్నాడు... తమ పార్టీ నాయకులను పార్టీ మారాలని అడుగుతున్నడంట... ఇలాంటి కలెక్టర్‌ను ఇక్కడకు తీసుకొచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామరావు మండిపడ్డారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో దీక్షా దివాస్ సన్నాహక సమావేశంలో కెటిఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పార్టీ నాయకులు ఎవరు కూడ భయపడవద్దని ఎవరు కూడా ఏమి చేయలేరన్నారు. అతి చేస్తున్న కలెక్టర్లు, అధికారుల పేర్లు రాసిపెట్టుకోవాలని కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తే తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత వడ్డీతో సహ చెల్లిస్తామని హెచ్చరించారు. ఇవ్వాళ రాజ్యాంగ దినోత్సవమని బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ సాధ్యమైందన్నారు. అందుకే తెలంగాణ ప్రజలంతా ఆయనకు రుణపడి ఉంటారని, బాబా సాహెబ్ చూపిన బాటలోనే బోధించు, పోరాడు, సమీకరించు అన్న విధానంలోనే కేసీఆర్ పోరాటం చేసి తెలంగాణ సాధించారని గుర్తు చేశారు. పదవి త్యాగంతో పార్టీని ఏర్పాటు చేసి...ప్రాణ త్యాగానికి కూడా సిద్ధపడి రాష్ట్రం సాధించిన నేత కేసీఆర్ అని మాజీ స్పీకర్ మధుసూధనాచారి అన్నారని అది వంద శాతం నిజమన్నారు. తెలంగాణ ఇప్పుడు రాష్ట్రంగా ఉండి... కాంగ్రెస్ వాళ్లు ముఖ్యమంత్రి, మంత్రి పదవులు అనుభవిస్తున్నారంటే దాని కేసీఆర్ అనే నాయకుడే కారణమన్నారు. కేసీఆర్ పోరాటాన్ని ఎన్ని రకాలుగా చిన్నగా చూపే ప్రయత్నం చేసినప్పటికీ తెలంగాణ ప్రజలు ఆయనను ఎన్నటికీ మరవరని కెటిఆర్ అన్నారు. రాజకీయంగా కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. మనకు కొన్ని కష్టాలు రావచ్చు రాజకీయంగా గానీ జీవితంలో కానీ ఎత్తు పల్లాలు సహజమన్నారు. గతేడాది ఇదే సమయంలో కాంగ్రెస్ నాయకులు అరచేతిలో స్వర్గం చూపటంతో కొన్ని చోట్ల ప్రజలు నమ్మి వాళ్లను గెలిపించారని ఇప్పుడు మోసపోయామని బాధపడుతున్నట్లు ఆయన పెర్కొన్నారు.




## సంక్షేమ గురుకులాల్లో క్రాఫ్ట్ టీచర్ల వెరిఫికేషన్ వాయిదా

### నేటి నుండి మ్యూజిక్ టీచర్ పోస్టుల వెరిఫికేషన్

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో క్రాఫ్ట్ టీచర్ల భర్తీ కోసం ఈ నెల 27 నుండి 29 వరకూ జరగాల్సిన సర్టిఫికేషన్ వెరిఫికేషన్‌ను వాయిదా వేసినట్లు ట్రిబ్ ఛైర్మన్ బడుగు సైదులు వెల్లడించారు. ఈ మేరకు ఒక ప్రకటనలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు చెప్పారు. త్వరలోనే కొత్త షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 27వ తేదీ నుండి 29వ తేదీ వరకూ మ్యూజిక్ టీచర్లకు సంబంధించిన సర్టిఫికేషన్ హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో జరుగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు సరైన ధృవపత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.



అర్ధరాత్రి మూసీలోకి కెమికల్ వదులుతున్న ట్యాంకర్‌ను సీజ్ చేసిన దృశ్యం

# గుట్టుచప్పుడుగా మూసీలోకి కెమికల్స్

### కెమికల్స్ ట్యాంకులను పట్టుకున్న స్థానికులు

**హైదరాబాద్ (అత్తాపూర్) నవంబరు 26, ప్రభాతవార్త :** గుట్టుచప్పుడు కాకుండా కెమికల్స్‌ను మూసిలో వదులుతున్న ఇండస్ట్రీల గుట్టు రట్టుయింది. గత కొన్ని రోజులుగా అత్తాపూర్ త్రివేణి సంఘం వద్ద ఉన్న మూసీ ప్రాంతాలలో తాండూరు, కర్ణాటక, పటాన్‌చెరు, షాద్ నగర్, బాలానగర్, తదితర ఇండస్ట్రీల నుండి తెచ్చిన ప్రమాదకరమైన కెమికల్స్‌ను ప్రతిరోజు 20వేల లీటర్ల చొప్పున 6 ట్యాంకర్లు అర్ధరాత్రి పూట దొంగచాటుగా మూసీలో వదులుతున్నట్లు గమనించిన స్థానికులు సోమవారం అర్ధరాత్రి కెమికల్స్ ట్యాంక్‌లను పట్టుకొని వెంటనే పోలీ సులు సమాచారం అందించారు. రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కెమికల్స్ వదులు తున్న ట్యాంకర్‌ని సీజ్ చేశారు. మీగతా లారీలను స్థానికులు పట్టుకునే ప్రయత్నం చేయగా పారి పోయినట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన రాజేంద్రనగర్ సిఐ కాస్ట్రో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. అర్ధరాత్రి కెమికల్స్ ట్యాంకులను మూసిలోకి వదులుతున్నట్లు సమాచారం రావడంతో ట్యాంకు సీజ్ చేసి కెమికల్స్‌ను ల్యాబ్‌కు పంపించడం జరిగిందని ఎన్ని రోజుల నుండి జరుగుతుంది. ఏ ప్రాంతాల పరిశ్రామల నుండి వస్తున్నాయని లోతుగా దర్యాప్తు చేసి కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

**స్థానికుల ఆందోళన**

అత్తాపూర్‌లోని మూసి వెంబడి ఖాళీ స్థలాన్ని కబ్జా చేసి అందులో ఇసుక వ్యాపారం లారీల పార్కింగ్ పెట్టి,ఎవరికి అనుమానం రాకుండా ఆ స్థలం నుండి మూసిలోకి ఏకంగా పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారని ఆ పైప్‌లైన్ ద్వారా ప్రతి రోజు కనీసం 8 నుండి 10భారీ ట్యాంకర్లను తెచ్చి కెమికల్స్‌ని మూసిలో వదులుతున్నారని వాపోయారు. దీంతో ఇక్కడ మూసి కలుషితం కావడంతో పాటు,దుర్గంధం వస్తుందని వీటితో పాటు వివిధ రకాల వ్యాధులకు గురవుతున్నారని ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడకుండా నిర్వహకులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# యాదాద్రి జిల్లాలో రూ. 24 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

### ముగ్గురు ముఠా సభ్యుల అరెస్టు

**భువనగిరి రూరల్, నవంబరు 26, ప్రభాత వార్త:** భారీ ఎత్తున డ్రగ్స్ తయారు చేసి తరలిస్తున్న ముఠాను తెలంగాణ నార్కొటిక్ బ్యూరో,రాచకొండ పోలీసులు సంయు క్తంగా నిర్వహించిన ఆపరేషన్ లో డ్రగ్స్ ముఠా గుట్టు రట్టు చేసి. రూ. 24 కోట్ల విలువ చేసే 120 కేజీల నిషేధిత ఎఫీడ్రైన్, మెఫిడ్రోన్ సింథటిక్ డ్రాగ్ ను గత మూడు నెలలు నుండి నిఘావేసి పట్టుకున్నట్లు భువనగిరి డిసిపి ఎం రాజేష్ చంద్ర వెల్లడించారు. మంగళవారం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన అందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. రామాజీ పేట గ్రామ శివారులో ఉన్న శ్రీ యాదాద్రి లైఫ్ సైన్సెస్ కెమికల్ ఫ్యాక్టరీ (ఫార్మా స్యూటికల్ )లో తయారు చేసి యాదగిరిగుట్ట నుండి ముంబైకి తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహిస్తూ డ్రగ్స్ సరఫరా చేస్తున్న వాహనాలను గుర్తించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి అదుపులోకి తీసుకొని విచారించగా చిన్న కందు కూరు గ్రామానికి చెందిన నేతి కృష్ణ రెడ్డి, ముంబై పట్టణ కేంద్రానికి చెందిన ఫైజాన్ అహ్మద్, అడ్డ గూడూరు మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన చెపురి సునీల్ (డ్రైవర్) లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిం చినట్లు తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
జమ్మికుంట మునిసిపాలిటీ
సంక్షిప్త టెండర్ ప్రకటన
1) నిట్ నం.6/MCJ/E1/2024-25, తేది: 23.11.2024. 2) రీకాల్ పనులు 7 నం.లు-14వ FC లభ్యత గ్రాంట్‌ల క్రింద 28.50 లక్షలు. 3) 1వ పిలుపు పనులు-8 నం.లు. SDF 2023-24 (30.00 లక్షలు) మరియు ఇతర గ్రాంట్‌లు. 4) బిడ్స్ దాఖలుకు చివరి తేది: 29.11.2024, సా.5.00 గం. 5) బిడ్ తెరుచు తేది: 30.11.2024 ఉ.11.00 గం. ఆపై. 6) తదుపరి వివరాలకు సంప్రదించవలసిన సంబంధిత అధికారి పేరు & చిరునామా: కమిషనర్, జమ్మికుంట మునిసిపాలిటీ, కరీంనగర్ జిల్లా, కాంటాక్ట్: 6309560333, వివరాలకు www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
DIPR.No.7084-PP/CL/Advt/1/2024-25, తేది: 26.11.2024 సం/- కమిషనర్, జమ్మికుంట మునిసిపాలిటీ



## సంచార జాతుల కూలీలపైకి దూసుకుపోయిన లారీ

### ఐదుగురు మృతి, మరో ఏడుగురికి తీవ్రగాయాలు

**త్రిశూర్, నవంబరు 26:** వేగంగా వస్తున్న లారీ ఒకటి అదుపుతప్పి సంచార జాతుల ప్రజలపైకి దూసుకుపోవడంతో ఐదుగురు చనిపోయారు. వారిలో ఇద్దరు చిన్నారులు కూడా ఉండటం గమనార్హం. త్రిశూర్ సమీపంలోని నట్టిక ప్రాంతంలో ఈఘోరమంజరిగింది. తెల్లవారుజామున నాలుగు గంటలప్రాంతంలో జెకెటియేటర్‌వద్దజరిగిన ఈ ప్రమాదంలో ఏడుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిలో ముగ్గురిపరిస్థితి విషమంగా ఉందని ప్రభుత్వ వైద్యశాలల ఆసుపత్రి వైద్యులు తెలిపారు. మృతుల్లో పాలక్కాడ్ గోవిందపురం వాసులు కలియప్పన్, నాగమ్మ, బంగారు, జీవన్, విశ్వలున్నారు. కన్నూరునుంచి కలపలోడుతో వస్తున్న లారీ రోడ్డుపక్కన ఉన్న టెంట్‌లో పది మంది నిద్రిస్తుండగా ఈ ట్రక్కు వేగంగా అదుపుతప్పి వారిపైకి దూసుకుపోయిందని దీనితో ఐదుగురు చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు విషయంలో ట్రక్కు కన్నూరునుంచి కోచికి వెళుతోందని, లారీ డ్రైవర్ 33ఏళ్ల అలెక్స్, లారీ క్లీనర్‌ను కూడా అరెస్టుచేసినట్లు పోలీసులు తెలిపారు. క్లీనర్ తాగి ఉన్నట్లు తెలిపారు. హైవేకుపక్కనే నిద్రపోతున్న ఈ సంచారజాతుల ప్రజలపైకి లారీ దూసుకుపోవడంతో వారిపైనుంచి వెళ్లిందని అక్కడికక్కడే చనిపోయినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

## భారత రాజ్యాంగం చాలా గొప్పది

### మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 26:** భారత రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనేక రాజ్యాంగాలను అధ్యయనం చేసిన తర్వాత వివిధ రాజ్యాంగాలలోని మేలిమి విషయాలను క్రోడీకరించి భారత దేశ పరిస్థితులకు అన్వయించి సిద్ధం చేసిన రాజ్యాంగాన్ని 75 సంవత్సరాల కిందట ఆమోదించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. భారత రాజ్యాంగ పరిషత్ అధ్యక్షులుగా బాబు రాజేంద్ర ప్రసాద్ రాజ్యాంగ రచనా సంఘం అధ్యక్షులుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారతీయులకు నిరంతరం స్మరణీయులుగా మిగిలిపోయారన్నారు. సామాన్య ప్రజలకు ప్రాథమిక హక్కుల రక్షణ కల్పించిన గొప్ప రాజ్యాంగం భారత రాజ్యాంగమని ఈ సందర్భంగా కొనియాడారు. ప్రజలకు హక్కులతో పాటు పౌరులకు దిశా నిర్దేశం చేయడం కోసం ఆదేశిక సూత్రాలను కూడా రాజ్యాంగంలో పొందుపరచడం జరిగిందన్నారు. రాజ్యాంగంలో ప్రాథమికమైన అంశాలైన న్యాయం,స్వేచ్ఛ,సమానత్వం కోసం హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

## అదానీపై జెపిసి విచారణ చేపట్టాలి

### రూ. 100 కోట్ల విరాళం వెనక్కి పంపడం

### హర్షణీయం: వామపక్ష పార్టీలు

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సౌర విద్యుత్ ఒప్పందాల కోసం లంచాలు ఇచ్చారనే అభియోగాలతో అమెరికా కేసు నమోదు చేసిన నేపథ్యంలో అదానీపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) విచారణ చేపట్టాలని సీపీఎం, సీపీఐ పార్టీలు డిమాండ్ చేశాయి. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పునర్విభజన చట్టంలో హామీలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. స్కిల్స్ యూనివర్సిటీకి అదానీ ఇచ్చిన రూ.100 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల వామపక్ష నేతలు హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో మంగళవారం నాడు సీపీఐ, సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు సమావేశమయ్యారు. ఈ భేటీలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు ఉభయ పార్టీల రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో సీపీఐ నుండి చాడ వెంకట్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి, తక్కెల్లపల్లి శ్రీనివాస్ రావు, ఎన్ బాలమల్లేష్, పశ్య పద్మ, భాగం హేమంతరావు, కలవేన శంకర్, వి ఎస్ బోస్, ఈటి నరసింహ పాల్గొనగా.. సీపీఐఎం నుంచి జూలకంటి రంగారెడ్డి, జి నాగయ్య, ఎస్ వీరయ్య, జాన్ వెస్లీ, డీజీ నర్సింగరావు, అబ్బాస్ పాల్గొన్నారు. అదానీతో గత ప్రభుత్వం 12 వందల కోట్ల రూపాయల ఒప్పంద వివరాలు సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు.

## 2008 డిఎస్సీ అభ్యర్థులకు వారంలో నియామక పత్రాలు!

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలిచ్చేందుకు పాఠశాల విద్యా శాఖ సిద్ధమైంది. వారంలో 2008 డీఎస్సీలో నష్టపోయిన బాధితులకి ఉద్యోగాలిచ్చేం దుకు అర్హులైన వారి లెక్కను పాఠశాల విద్యాశాఖ తేల్చింది. సుమారు 1399 మంది ఉద్యాగాలు పొందేందుకు అర్హులని గుర్తించినట్టు తెలిసింది. వారికి వారంలో నియామక పత్రాలివ్వాలని పాఠశాల విద్యా శాఖ నిర్ణయించింది. 2008 డీఎస్సీ బాధిత అభ్యర్థులను కాంట్రాక్ట్ టీచర్లుగా నియమించాలని ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తొలుత ఉమ్మడి జిల్లాల వారీగా అభ్యర్థుల జాబితాలను విద్యాశాఖ అధికారులు విడుదల చేశారు. వారికి సెప్టెంబర్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించారు.

## డబుల్ బెడ్‌ఇళ్ల కాలనీల్లో కనీస వసతులకు రూ.196 కోట్లు విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 26:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసింది. ఆయా కాలనీల్లో కనీస సౌకర్యాలకోసం రూ.196కోట్ల 46లక్షల 13వేల 413 నిధులను మంగళవారం విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాశ్ జీవో జారీ చేశారు. ఈ మొత్తాన్ని డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీల్లో నీటి వసతి, విద్యుదీకరణ, మురుగునీటి పారుదల వ్యవస్థను చేపట్టనున్నారు.

# రాజ్యాంగం అనేది పత్రం కాదు ప్రజల ఆత్మ

## సుప్రీంకోర్టు రాజ్యాంగ దినోత్సవసభలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, నవంబరు 26:** రాజ్యాంగం అనేది ఒక పుస్తకంగా భావించకూడదని, నిరంతరం కొనసాగే జనజీవనస్రవంతి ప్రక్రియ అని ప్రధానిమోడీ పేర్కొన్నారు. రాజ్యాంగమే మనకు మార్గదర్శి అని రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిందని, మన రాజ్యాంగం కాలపరీక్షలన్నింటినీ తట్టుకుని నిలిచిందని ఆయన అన్నారు. రాజ్యాంగం అంటేనే ప్రజాస్వామ్య దీపిక అని రాజ్యాంగం, రాజ్యాంగ నిర్మాతలకు మనమంతా శిరసువంచి నమస్కరించాలని ఆయన అన్నారు. జమ్ముకాశ్మీర్‌లో ఇపుడు రాజ్యాంగం పూర్తిగా అమలులోకి వచ్చిందని, తొలిసారి అక్కడ రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు.



దేశం ముందు అనేభావన అనేక శతాబ్దాలపాటు రాజ్యాంగాన్ని సజీవంగా కొనసాగిస్తుందని ప్రధాని అన్నారు. వికసిత్‌భారత్ లక్ష్యసాధనలో రాజ్యాంగ నిబంధనలు అనుసరించడం కూడా ఒక కీలక పాత్ర అని ఆయన అన్నారు. సత్వర న్యాయంజరిగేలా కొత్త న్యాయనియమావళి అమలుచేసామని, శిక్ష ఆధారిత వ్యవస్థ ఇపుడు న్యాయ ఆధారిత వ్యవస్థగా మారిందని మోడీ చెప్పారు. ముంబయి మారణహోమం దుర్ఘటన ఇదేరోజు జరిగిందని, ఆ విషాదసంఘటనలో మృతిచెందిన అందరికీ మనం నివాళులర్పించుకోవాలని ఆయన అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బాబాసాహెబ్ చేసిన వ్యాఖ్యలు గుర్తుచేసారు. కేవలం న్యాయవాదుల పత్రం కాదని, ఇది ఒక దేశ ఆత్మ అని ఎల్లప్పుడూ ఒక స్ఫూర్తి అని అన్నారని, దేశం, సమయం పరిస్థితులకు అనుగుణంగా తగిన నిర్ణయాలు తీసుకోవడం రాజ్యాంగాన్ని కాలానుగుణంగా అర్థంచేసుకునే స్వేచ్ఛను మనకు రాజ్యాంగ నిర్మాతలు అందించారని ప్రధాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్‌జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్‌లు బిఆర్‌గవాయి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా న్యాయవ్యవస్థ 2023–24 నివేదికను ప్రధాని విడుదలచేసారు.

# ఫ్యూచర్ హబ్‌గా హైదరాబాద్

### 2050 మాస్టర్ విజన్‌తో అభివృద్ధి

### రూ.లక్ష కోట్లకుపైగా పనులకు శ్రీకారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 26:** తొలి ఏడాదిలోనే ప్రజా ప్రభుత్వం హైదరాబాద్ మహానగర అభివృద్ధికి వినూత్న పంథాను అనుసరించిందని ముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. గ్రేట్ ప్లాన్‌తో.. గ్రేటర్ విజన్‌తో సిటీలో ట్రాఫిక్ రద్దీని తట్టుకునేలా ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో, రోడ్లు, రవాణా సదుపాయాల విస్తరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారించారు. పెరుగుతున్న జనాభా, నగర విస్తరణకు అనుగుణంగా 2050 మాస్టర్ ప్లాన్‌తో గ్రేటర్ సిటీ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించారు. సికింద్రాబాద్లోని అల్వాల్ సమీపంలో రాజీవ్ రహదారిపై రూ.2,232 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టనున్నారు. హైదరాబాద్ నాగ్‌పూర్ జాతీయ రహదారిపై రూ.1580 కోట్లతో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. వీటితో సిటీలో ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించే వీలుంది. ఈ కారిడార్ల నిర్మాణానికి, మొహిదీపట్నం స్కైవాక్ నిర్మాణాలకు ప్రధాన అడ్డంకిగా ఉన్న రక్షణ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసేందుకు సిఎం పలుమార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్రంతో సంప్రదింపులు జరిపారు. గడిచిన పదేండ్లలో పెండింగ్లో ఉన్న ఈ భూముల స్వాధీన ప్రక్రియను కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే సాధించగలిగింది. హైదరాబాద్‌లోని చెర్వులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. పోలీస్, ట్రాఫిక్, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ సమన్వయంతో ఈ వ్యవస్థను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ లో మురికి నీటి కూపంగా మారిన మూసీ నది పునరుజ్జీవంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. నగరంలోని జంట జలాశయాలు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ ను పునరుద్ధరించేలా ప్రతిపాదనలు తయారు చేసింది. మూసీ నదిలోకి చేరుతున్న మురికి నీటిని శుద్ధి చేసేందుకు 39 ఎస్టీపీలను ఏర్పాటు చేస్తోంది. ఎల్లంపల్లి నుంచి మరో 20 టీఎంసీల గోదావరి నీళ్లను హైదరాబాద్‌లో తాగునీటికి, మూసీలో స్వచ్ఛమైన నీటి ప్రవాహానికి వీలుగా బహుళ ప్రయోజనాలుండే ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా బాపూఘాట్ ను దేశంలో ఎక్కడా లేని విధంగా అద్భుతంగా తీర్చిదిద్దే ప్రణాళికలను సిద్ధం చేసింది. అంతర్జాతీయ స్థాయిలో గాంధీ ఐడియాలజీ సెంటర్ను ఇక్కడ నెలకొల్పనుంది. మీర్‌అలం చెరువు సమీపంలో దాదాపు రూ.360 కోట్ల అంచనా వ్యయంతో 4లేన్ వంతెన నిర్మాణం చేపడుతోంది. ఎల్‌బీనగర్ సమీపంలో బైరామాల్ గూడ ఫ్లైఓవర్ను ప్రారంభించింది. ఆరంఘర్ నుంచి జూ పార్క్ వరకు ఫ్లైఓవర్‌ను త్వరలోనే ప్రారంభించనుంది. హైదరాబాద్ సిటీలో రవాణా సేవలను విస్తరించేందుకు కొత్తగా ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయటంతో పాటు మహాలక్ష్మీ ద్వారా సిటీ బస్సుల్లో దాదాపు 50 లక్షల మంది మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించింది. రూ. 24,237 కోట్లతో మెట్రో రైలు రెండవ దశ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పుడున్న 69 కిలోమీటర్లకు అదనంగా ఫేజ్ 2లో పాతబస్తీ చుట్టుముట్టేలా ఎయిర్ పోర్టు వరకు 76.4 కిలోమీటర్ల మెట్రో విస్తరణ చేపట్టనుంది. నాగోల్ నుంచి శంషాబాద్, రాయదుర్గ్ నుంచి కోకాపేట్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట, మియాపూర్ నుంచి పటాన్ చెరు వరకు, ఎల్బీ నగర్ నుంచి హయత్‌నగర్ వరకు రెండో దశలో విస్తరిస్తారు. హైకోర్టు నూతన భవనానికి బుద్వేల్ లో 100 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. వీటితో పాటు ఉస్మానియా కొత్త ఆసుపత్రి భవనాన్ని గోషా మహల్ సమీపంలో నిర్మించేందుకు స్థలాన్ని కేటాయించింది. హైదరాబాద్ సిటీ ఇన్నోవేషన్ అండ్ ట్రాన్స్ ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్‌సిఐటిఐ) ప్రాజెక్ట్‌లో భాగంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో రహదారుల నిర్మాణానికి దాదాపు రూ.8,996 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసింది. రూ.596.2 కోట్ల అంచనాలతో వరద నీటి కాలువల నిర్మాణం చేపట్టింది. వాన పడితే నీళ్లు నిలిచి ట్రాఫిక్ స్తంభించిపోతున్న సమస్యను పరిష్కరించేందుకు సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ ప్రదర్శించారు. నీళ్లు నిల్వ చేరే ప్రధాన జంక్షన్లన్నింటా వాటర్ ఇన్ టేక్ వెల్స్ తవ్వించి, అక్కడి నుంచి నీటిని డ్రైనేజీలకు, నాలాలకు తరలించే ప్రాజెక్టును చేపట్టారు. కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ రద్దీని అధిగమించేలా రూ.826 కోట్ల అంచనాలతో ఆరు జంక్షన్లను అభివృద్ధి చేసే ప్రాజెక్టుకు ప్రభుత్వం ఇటీవలే పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని సంగారెడ్డి నుంచి ప్రారంభమై రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, శంకర్ పల్లి మీదుగా మహబూబ్‌నగర్ లోని ఆమనగల్లు, కందుకూరు, ఇబ్రహీంపట్నం నుంచి నల్గొండ జిల్లా చౌటుప్పల్ వరకు దాదాపు 189 కిలోమీటర్లు ఈ రహదారి నిర్మిస్తారు. హైదరాబాద్‌లో దాదాపు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసింది.

# 15 యేళ్లు దాటిన స్కూల్ బస్సులు రోడ్డుపైకొస్తే సీజ్

### ప్రమాదాల నివారణకు రోడ్ సేఫ్టీపై పాఠశాలల్లో అవగాహన సదస్సులు

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త :** ఇకపై పదిహేనేళ్లు దాటిన స్కూల్ బస్సులు రోడ్డు మీదికి వస్తే సీజ్ చేయాలని రవాణా శాఖ నిర్ణయించింది. ప్రమాదాల నివారణకు సంబంధించి రోడ్ సేఫ్టీపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఆ శాఖ అవగాహన సదస్సులు నిర్వహించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 25 వేల స్కూల్ బస్సులు ఉన్నట్లు రవాణా శాఖ అధికారుల వద్ద ఉన్న గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ బస్సులు చాలా వరకు ఫిట్నెస్, ఇన్సూరెన్స్ వంటి నిబంధనలు పాటించకపోగా స్కూల్ బస్సులు నడుపుతున్న డ్రైవర్లకు సరైన డ్రైవింగ్ లైసెన్స్ కూడా ఉండటం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభంలో స్కూల్ యాజమాన్యాలు బస్సుల ఫిట్నెస్‌పై శ్రద్ధ తీసుకుని ఆ తరువాత వాటికి కిలోమీటర్ల ప్రాతిపదికన సరైన సర్వీసింగ్ చేయించకుండా వదిలేస్తున్నాయి. దీంతో షరా మామూలుగా పాఠశాలల బస్సులు ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో పాఠశాల, కళాశాలల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కలిగించాలనీ, ప్రతీ పాఠశాలలో ట్రాఫిక్ అవగాహన పార్క్ ఏర్పాటు చేయాలని కొత్తగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లో కూడా ఇది తప్పనిసరిగా ఉండేలా రవాణా శాఖ అధికారులు విద్యాశాఖాధికారులతో సంప్రదించి చర్యలు చేపట్టనున్నారు. 15 సంవత్సరాలు దాటిన ప్రైవేట్ వాహనాలు గ్రీన్ ట్యాక్స్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు.

# ముగిసిన బిసి కమిషన్ బహిరంగ విచారణ

### కమిషన్ చైర్మన్ నిరంజన్

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల(బీసీ) స్థితిగతుల అధ్యయనంలో భాగంగా రాష్ట్రంలో బీసీ కమిషన్ బహిరంగ విచారణను నిర్వహించగా.. అదికాస్త మంగళ వారంతో ముగిసింది. రాష్ట్రంలో రెండు విడతలుగా 10 ఉమ్మడి జిల్లాల్లో పర్యటించిన కమిషన్ బహిరంగ విచారణలు చేపట్టింది. దాంతోపాటు రెండు రోజులపాటు హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలోనూ బహిరంగ విచారణలు జరిపింది.

మంగళవారంతో బహిరంగ విచారణలు పూర్తి కాగా.. అనంతరం కమిషన్ చైర్మన్ జి నిరంజన్ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీ, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస రావు, స్పెషల్ ఆఫీసర్ జి సతీష్ కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. 10 ఉమ్మడి జిల్లా కేంద్రాలతోపాటు రాష్ట్ర స్థాయిలో జరిగిన పబ్లిక్ హియరింగ్‌లో మొత్తంగా 1,336 వినతులు వచ్చాయని నిరంజన్ తెలిపారు. వాటిపై కమిషన్ త్వరలో ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పిస్తుందన్నారు. బహిరంగ విచారణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కమిషన్ ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతుందన్నారు. బహిరంగ విచారణలో భాగంగా వివిద కుల సంఘాల నుండి వారి వారి వినతులను అఫిడవిట్ రూపం లో స్వీకరించినట్టు తెలిపారు.



కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పెద్ద ఎత్తున బహిరంగ విచారణకు హాజరై తమ విజ్ఞప్తులను కమిషన్‌కు సమర్పించారని తెలిపారు. వినతుల్లో భాగంగా మొత్తంగా రాష్ట్రంలో ఉన్న బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని విన్నవించారని చైర్మన్ తెలిపారు. వివిధ కుల సంఘాల ప్రతినిధులు సమస్యలతోపాటు, తమ వెనుకబాటుతనాన్ని కమిషన్ దృష్టికి తీసుకువచ్చినట్టు తెలిపారు. నాయీ బ్రాహ్మణులను దేవాలయ ఉద్యోగులుగా గుర్తించాలని అలాగే గంగపుత్రులకు చేపల చెరువులలో 50 శాతం రిజర్వ్ చేయాలని.. ఆత్మగౌరవ భవనాలను నిర్మించాలని కోరారు. బీసీలలో గ్రూపుల మార్పు, వివిధ కులాల ఫెడరేషన్ల ఏర్పాటుతోపాటు వాటి బలోపేతం వంటి పలు అంశాలను కమిషన్ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు.

# తెలంగాణలో సామాజిక, ఆర్థిక, కుల సర్వే 92శాతం పూర్తి

### ఢిల్లీలో సంవిధాన్ రక్షక్ అభియాన్ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




**ప్రభాతవార్త ప్రధాన ప్రతి నిధి, హైదరాబాద్, నవం బరు 26:** దేశవ్యాప్తంగా కుల గణన అనేది కాంగ్రెస్ ఆధ్వర్యంలో సాధించే సామాజిక న్యాయం మూడో ఉద్య మమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రథమ ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ నుంచి ఇందిరా గాంధీ వరకు ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు, బ్యాంకుల జాతీయీకరణ వంటి కార్యక్రమాలతో సామాజిక న్యాయం మొదటి దశ సాధిస్తే... రాజీవ్ గాంధీ హయాంలో 18 ఏళ్లకే ఓటు హక్కు.. మండల్ కమిషన్ నివేదిక వంటి కార్యక్రమాలతో సామాజిక న్యాయం 2.0 పూర్తయిందని.. ఇప్పుడు సోనియా గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీల ఆధ్వర్యంలో కుల గణనకు సామాజిక న్యాయం 3.0 ప్రారంభమైందన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ కేంద్ర పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలోని తలకటోరా స్టేడియంలో మంగళవారం నిర్వహించిన సంవిధాన్ రక్షక్ అభియాన్ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ మహా యుద్ధం ప్రకటించారని... ఆయన బాటలో నడుస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సామాజిక, ఆర్థిక, కుల సర్వే మొదలుపెట్టిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో సర్వే 92 శాతం పూర్తయిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణలో కుల సర్వే పూర్తి కాగానే తాము సామాజిక న్యాయం మూడో మహా యుద్ధాన్ని ముందుకు తీసుకెళతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జితని భాగి దారి.. ఉతని హిస్సే దారి...(హౌ మచ్ పాపులేషన్ యు హావ్ కమ్యూనిటీ మస్ట్ గెట్ దట్ మచ్ రిసోర్సెస్) కచ్చితంగా అమలు కావాలని ఆయన అభిప్రాయపడ్డారు. పదేళ్లుగా దేశంలో రాజ్యాంగం ప్రమాదం లో ఉందని, రాజ్యాంగ రక్షణకు రాహుల్ గాంధీ దేశ వ్యాప్త ఉద్యమం చేపట్టారన్నారు. రాహుల్ చేపపట్టిన ఉద్యమంలో ప్రజలు భాగస్వాములైనందునే మోదీ 400 వందల సీట్లు అడిగితే ప్రజలు కేవలం 240 సీట్లకు పరిమితం చేశారని సీఎం అన్నారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల్లో మోదీని ప్రజలు ఓడిస్తున్నారని.. వయనాడ్, నాందేడ్ లోక్‌సభ ఉప ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మహారాష్ట్రలో బీజేపీ కూటమి గెలిస్తే, ఝార్ఖండ్‌లో కాంగ్రెస్ కూటమి గెలిచిందన్నారు. రాజ్యాంగ రక్షణ ఉద్యమం కేవలం రాహుల్ గాంధీకి పరిమితమైన అంశంగా అనుకోవద్దని, మనమంతా అందులో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రస్తుత పోరాటం రాజ్యాంగ రక్షకులు... రాజ్యాంగ శత్రువుల మధ్యనే ఉందని గుర్తుంచుకోవాలన్నారు. మహాత్మా గాంధీ పరివార్ రాజ్యంగ రక్షణకు పూనుకుంటే... మోదీజీ పరివార్ అంటే సంఘ్ పరివార్ రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని సీఎం విమర్శించారు.

## 16 జిల్లాల్లో 100 శాతం సర్వే పూర్తి

### ఇప్పటివరకు 1,10,18,102 నివాసాల్లో ముగిసింది

### ముమ్మరంగా సమగ్ర సర్వే డేటా కంప్యూటరీకరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 26:** రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కులగణన సర్వేతో పాటు కంప్యూటరీకరణ కూడా ముమ్మరంగా కొనసాగుతుంది. మొత్తం ఇప్పటి వరకు సేకరించిన సర్వే సమాచారంలో 20,86,707 నివాసాల సర్వే సమాచారాన్ని కంప్యూటరీకరించారు. ఈ సమగ్ర ఇంటింటి సర్వే లో మొత్తం 1,17,89,076 నివాసాలు గుర్తించగా, నేటివరకు 1,10,18,102 నివాసాలలో సర్వే పూర్తి చేసి 93.5 శాతానికి చేరుకుంది. రాష్ట్రంలో 16 జిల్లాలో 100 శాతం సర్వే పూర్తయింది. మరో 13 జిల్లాలో 99 శాతంపైగా సర్వే పూర్తి చేసుకొని 100 శాతం లక్ష్యానికి చేరువలో ఉన్నాయి. జి.హెచ్.ఎంసీ పరిధి లో కూడా సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. జిహెచ్‌ఎంసీ పరిధి లో 25,05,517 నివాసాలు సర్వే చేయాల్సి ఉండగా నేటి వరకు 19,62,950 నివాసాలలో సర్వే పూర్తి చేసి 78.3 శాతానికి చేరుకుంది. డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎన్యుమరేటర్ కలిసి సర్వే వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలన్ని జిల్లా ఇన్ చార్జ్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సర్వే పత్రాలను భద్రంగా ఉంచాలని అధికారులు స్పష్టమైనా ఆదేశాలు జారీ చేశారు. కుటుంబ సర్వే వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదుకు చర్యలు చేపట్టారు.

### ఫ్యాన్సీ నంబర్లతో రవాణా శాఖకు

## కాసుల పంట

### ఒక్కరోజే రూ.52,52,283 లక్షల ఆదాయం

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయానికి కాసుల పంట పండిది. ఫాన్సీ నంబర్ల విక్రయంతో ఒక్కరోజే రూ.52,52,283 లక్షల ఆదాయం సమకూరిందని హైదరాబాద్ జెటిసి రమేశ్ తెలిపారు. అత్యధికంగా టిజి 09 డి 0001 నంబర్‌కు రూ.11,11,111 ఆదాయం వచ్చింది. ఈ నంబర్‌ను రుద్రరాజు రాజీవ్ కుమార్ ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో దక్కించుకున్నారు. అలాగే, టిజి 09 డి 0009 కు రూ.10,40,000 ఆదాయం లభించింది. ఈ నంబర్‌ను మేఘా ఇంజినీరింగ్ కంపెనీ చేజిక్కించుకుంది. అలాగే, టిజి 09 సి 9999 కు రూ.7,19,999, టిజి 09 డి 0006 నంబరుకు రూ.3,65,000 ఆదాయం లభించింది. వీటితో పాటు మరికొన్ని ఫ్యాన్సీ నంబర్ల ద్వారా రవాణా శాఖకు రూ.లక్షల్లో ఆదాయం సమకూరిందని రమేశ్ తెలిపారు.

## డబ్ల్యుఎస్‌డబ్ల్యు సైబర్‌గస్తీ మరో ఘనత

### బెంగాల్‌లో బాలలపై లైంగిక వేధింపుల ప్రచార సామాగ్రి వ్యాప్తిచేస్తున్న నేరగాడి పట్టివేత

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్ర మహిళా భద్రతా విభాగం (డబ్ల్యుఎస్‌డబ్ల్యు) మహిళలపై జరిగే లైంగిక వేధింపులతో పాటు బాలలపై జరిగే వేధింపుల నివారణ విషయంలో మరో ఘనతను అందుకుంది. డబ్ల్యుఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో కొనసాగుతున్న సైబర్ గస్తీ బృందం నిఘా వర్గాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా దేశ వ్యాప్తంగా బాలలపై లైంగిక వేధింపుల ప్రచార సామాగ్రి వ్యాప్తి చేస్తున్న వ్యక్తులపై పక్కా సమాచారంతో ఆయా రాష్ట్రాల పోలీసులకు నేరగాళ్లకు సంబం ధించిన వివరాలను పంపుతూ వారు పట్టుబడేలా చూస్తోంది. ఈ క్రమంలో బెంగాల్‌లోని బిర్భూం జిల్లా మొంగల్‌దిహా పోలీసు స్టేషన్ పరిధిలో ఓ నేరగాడు బాలలపై లైంగిక వేధింపుల ప్రచార సామాగ్రి వ్యాప్తి చేస్తున్నట్లు సమాచారం అందగా ఈ వివరాలను సైబర్ గస్తీ అధికారులు అక్కడి పోలీసులకు పంపారు. దీని ఆధారంగా స్థా నిక పోలీసులు సదరు నేరగాడిని అరెస్టు చేశారు. ఇతను బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించి వెయ్యికి పైగా ప్రచార సామాగ్రి వ్యాప్తి చేస్తున్నట్లు తేలింది. ఇందు లో ఆడియో, వీడియోలతో పాటు పుస్తకాలు కూడా వున్నాయి. అనేకరకాల ప్రసారమాధ్యమాల ద్వారా ఇతను వీటిని అమ్ముకుంటూ ఆన్‌లైన్ సహా పలు రకాలుగా డ బ్బులు వసూలు చేస్తున్నట్లు తేలింది. డబ్ల్యుఎస్‌డబ్ల్యులో కీలకంగా వున్న షీ సైబర్ లాబ్ ద్వారా దేశ వ్యాప్తంగా బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించి 180 వ స్తువులను కనుగొ నగా ఇదే సమయంలో 20 ఎఫ్‌ఐఆర్‌లు జారీ అయ్యాయి. ఇందులో 21 మంది నిందితులు వున్నారు. బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించి షీ సైబర్ లాబ్ దేశ వ్యాప్తంగా 21 మందిని అరెస్టు చేయగా ఇందులో తెలంగాణలో 14 మంది ఎపిలో ఇద్దరు వున్నారు. బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించి న కేసుల్లో నిందితులు ఎంతటి వారైనా వదిలేది లేదని, ఈ తరహా నేరాలను తీవ్రంగా పరిగణిస్తామని డబ్ల్యుఎస్‌డబ్ల్యు డిజి శిఖా గోయల్ తెలిపారు.

# ముగ్గురు ఎస్‌పిలు, 30 మంది అదనపు ఎస్పీల బదలీ

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు ఎస్‌పిలతో పాటు 30 మంది అదనపు ఎస్పీలను బదిలీ చేసింది. ఈ మేరకు హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్తా మంగళవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. బదలీ అయిన ఎస్‌పిల (డిసిపిలు) వివరాలు ఇలావున్నాయి. సిఐడిలో వున్న నాగ లక్ష్మిని రాచకొం డ సైబర్ క్రైం డిసిపిగా నియమించగా సిఐడిలోనే వున్న లావణ్య నాయక్ జాదవ్‌ను హైదరాబాద్ మహిళా భద్రతా విభాగం డిసిపిగా బదిలీ చేశారు. కమాండ్ కంట్రో ల్‌లో ఎస్‌పిగా వున్న పుష్పను నార్కోటిక్ బ్యూరోకు బదిలీ చేశారు. కాగా అదనపు ఎస్పీల బదిలీల వివరాలు ఇలావున్నాయి. వెయిటింగ్‌లో వున్న శంకర్‌ను సిఐడిలో ,ఉపేంద్రా రెడ్డిని నిర్మల్ జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన)గా నియమించగా నిర్మల్ జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన)గా వున్న సూర్యనారాయణను పౌర సరఫరాల వి భాగంలో నియమించారు. వెయిటింగ్‌లో వున్న ప్రతాప్ కుమార్‌ను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో నియమించగా కృష్ణగౌడ్‌ను హైదరాబాద్ సెంట్రల్ జోన్ అదనపు డిసి పిగా బదిలీ చేశారు. వెయిటింగ్‌లో వున్న వెంకటేశ్వర బాబును నిఘా విభాగంలోనూ, నర్సయ్యను హైదరాబాద్ ఈస్ట్ జోన్ అదనపు డిసిపిగా బదిలీ చేశారు. వెయిటి ంగ్‌లో వున్న పిచ్చయ్యను సిఐడిలో నియమించగా కమలాకర్ రెడ్డిని ఎసిబిలో నియమించారు.

కాగా ఎసిబిలో వున్న ఇక్బాల్ సిద్దిఖీని సైబరాబాద్ సిసిఎస్‌లో నియమి ంచారు. వెయిటింగ్‌లో వున్న కిషన్‌ను భూపాలపల్లి అదనపు ఎస్‌పిగానూ, మహమ్మద్ మజీద్‌ను దక్షిణ మండల అదనపు డిసిపిగానూ నియమించారు.

దక్షిణ మండల అదనపు డిసిపిగా వున్న జహంగీర్‌ను సిఎస్‌డబ్ల్యుకు బదిలీ చేయగా వెయిటింగ్‌లో వున్న బస్వారెడ్డిని నిజామాబాద్ జిల్లా పరిపాలనా విభాగం అదనపు డిసిపిగా నియ మించగా అక్కడ వున్న కోటేశ్వరరావును రాచకొండ కమిషనరేట్‌లోని ఎల్‌బి నగర్ అదనపు డిసిపిగా నియమించారు. వెయిటింగ్‌లో వున్న పురుషోత్తంను మేడ్చల్ అద నపు డిసిపిగానూ హైదరాబాద్ పశ్చిమ మండల అదనపు డిసిపిగా వున్న హనుమంతరావును వికారాబాద్ జిల్లా పరిపాలనా విభాగం అదనపు ఎస్‌పిగా బదిలీ చేశారు. వికారాబాద్ జిల్లా పరిపాలనా విభాగం అదనపు ఎస్పిగా వున్న రవీందర్ రెడ్డిని హైదరాబాద్ సిసిఎస్ ఆర్థిక నేరాల విభాగంలో నియమించారు. కమాండ్ కంట్రోల్‌లో వున్న వెంకటరమణను రాచకొండ పరిధిలోని మల్కాజిగిరి అదనపు డిసిపిగా నియమించగా పోలీసు అకాడమిలో వున్న వెంకట్‌రావును ఖమ్మం కమిషనరేట్‌లో అదన పు డిసిపి (శాంతి భద్రతలు)గా బదిలీ చేశారు. ఖమ్మం కమిషనరేట్‌లో అదనపు డిసిపిగావున్న హైదరాబాద్ ట్రాఫిక్ విభాగంలో నియమించారు.

ఆసిఫాబాద్ అదనపు డిసిపిగా వున్న ప్రభాకర్ రావును వరంగల్ కమిషనరేట్‌లో ఆపరేషన్స్ విభాగంలో నియమించగా, కొత్తగూడెం ఆపరేషన్స్ అదనపు ఎస్‌పిగా వున్న సాయి మనోహర్‌ను మాదాపూర్‌లో ట్రాఫిక్ విభాగంలో నియమించగా ఇక్కడ వున్న శివకుమార్‌ను రాచకొండ పరిపాలనా విభాగం అదనపు డిసిపిగా నియమించారు. హైదరాబాద్ ట్రా ఫిక్‌లో వున్న షేక్ హుస్సేన్‌ను రాచకొండ ఎస్‌ఓటికి బదిలీ చేయగా సైబరాబాద్ క్రైమ్స్‌లో వున్న శ్రీనివాసులును సిఐడిలో నియమించారు.

రాచకొండ క్రైం విభాగం అ దనపు డిసిపిగా వున్న ఎం. శ్రీనివాసులును నిఘా విభాగంలో బదిలీ చేయగా, వనపర్తి జిల్లా అదనపు ఎస్పీ రాందాసును హైదరాబాద్ సిటిసిలో నియమించారు. పో లీసు అకాడమిలో వున్న సుదర్శన్‌ను హైడ్రాకు బదిలీ చేయగా ఆర్టీసీలో వున్న శ్రీనివాసరావును సంగారెడ్డి డిటిసిలో నియమించారు,

